ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 25 సెప్టెంబరు 2025



ఊరికి వెళ్లే ముందు సమాచారం అందించాలి : సీఐ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లోని ప్రజలు ఊరికెళ్తే తమకు సమాచారం అందిస్తే ఆ ఇళ్లపై నిఘా ఉంచుతామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే ముందు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇళ్ల చుట్టు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఇళ్లకు సెంట్రల్ లాక్‌సిస్టం తాళంతో పాటు సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ లైట్స్‌ను బిగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో ప్రయాణానికి సంబంధించిన వివరాలను పొందుపర్చకూడదని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే 100 నంబర్ కాల్ చేసి వివరాలను చెప్పాలని అన్నారు. చోరీలను నియంత్రించేందుకు ప్రజలకు తమకు సహకరించాలని సీఐ శ్రీనివాస్ కోరారు.

సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలి

చందుర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని టీజీ రెడ్‌కో మేనేజర్ మునీందర్‌రెడ్డి, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మీకాంతరావులు పిలుపునిచ్చారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో సోలార్ విద్యుత్‌పై బుధవారం అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేసుకున్న వారికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. గృహ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



- సీల్డ్ కవర్లలో రిజర్వేషన్లు భద్రం
- మరో రెండు రోజుల్లో ప్రకటనకు అవకాశం
- జిల్లాలో 260 సర్పంచ్, 2268 వార్డు సభ్యులు
- 12 ఎంపీపీ, జడ్పీటీసీ, 123 ఎంపీటీసీ స్థానాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

స్థానిక ఎన్నికల ప్రక్రియ వేగవంతంగా ముందుకు సాగుతోంది. ఇప్పటికే సర్పంచ్, వార్డు సభ్యులు, పరిషత్‌ల ఓటర్ల తుది జాబితాలు వెల్లడించారు. ఇదే క్రమంలో స్థానిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన రిజర్వేషన్ల ప్రక్రియ మూడు రోజులుగా కలెక్టర్ నేతృత్వంలో అత్యంత గోప్యంగా కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. బుధవారం ఉదయం మిగిలిన వార్డుల రిజర్వేషన్లు కూడా పూర్తిచేసి సీల్డ్ కవర్లో భద్రపరిచి ఉంచారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఆయా కులాల నిష్పత్తి ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టారు. 2024 సంవత్సరంలో చేపట్టిన కులగణన ప్రకారం 42శాతం బీసీ రిజర్వేషన్లు, 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు స్థానిక సంస్థలు రిజర్వేషన్లు కల్పిస్తున్నారు.

రిజర్వేషన్లపై నేతల ఆరా..

స్థానికసంస్థల రిజర్వేషన్ల ప్రక్రియపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో అధికార యంత్రాంగం పూర్తిచేస్తున్న క్రమంలో వివిధపార్టీల నాయకులు ఆశావహులు ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్ రిజర్వేషన్లు ఎలా వచ్చాయనే దానిపై ఆరా తీస్తున్నారు. అధికారికంగా ప్రకటించే వరకు గోప్యంగా ఉంచాలని ఎవరైనా రిజర్వేషన్లు లీక్ చేస్తే కఠిన చర్యలు తప్పవనే సంకేతాలు ప్రభుత్వం అధికారులకు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో అత్యంత గోప్యంగా రిజర్వేషన్ల ప్రక్రియను చూస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12జడ్పీటీసీలు, ఎంపీపీలు, 123 ఎంపీటీసీలు, 260 సర్పంచులు, 2268 వార్డుసభ్యుల స్థానాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి 2019 రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని తాజా లెక్కల ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. వందశాతం ఎస్టీలు ఉన్న గ్రామాలు మళ్లీ వారికే రిజర్వేషన్లు చేసినట్లుగా తెలిసింది.

ఆశావహుల్లో టెన్షన్..

స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణకు వెళుతున్నట్లుగా ప్రభుత్వ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడం అదే క్రమంలో దసరాలోపే షెడ్యూల్ విడుదలకు అవకాశం ఉండడంతో రిజర్వేషన్లపై ఆశావహులు టెన్షన్ మొదలైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియామక పదవులు దక్కకుండానే రెండేళ్లు గడిచిపోయింది. ఈక్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కలిసి వస్తే పదవులు దక్కుతాయని ఆశతో ఉన్నారు. ఇప్పటికే గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల బరిలో దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి కసరత్తు ప్రారంభించారు. రిజర్వేషన్లు ఎలా ఉండబోతున్నాయనే ఉత్కంఠ మాత్రం జిల్లావ్యాప్తంగా మొదలైంది. 2019లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా, 252గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీసీలకు 56స్థానాలు, ఎస్సీలకు 51, ఎస్టీలకు 30....

- మిగతా 8లో

మహిళల ఆరోగ్యానికి పకడ్బందీగా పథకాల అమలు



వెంకటాపూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న రజిత

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లాలో మహిళల ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా వైద్యాధికారి రజిత అన్నారు. స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లోని రికార్డులు, అందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్య శిబిరాల్లో మహిళలకు రక్త, మూత్ర, మధుమేహం పరీక్షల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ మహిళలు సమతుల ఆహారం తీసుకుని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు వైద్య సిబ్బంది పాటు పడాలని అన్నారు. గ్రామాల్లో మహిళల వ్యాధుల పట్ల అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయాలని అన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబాలు శక్తివంతమవుతాయని పేర్కొన్నారు. జిల్లాలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి మహిళల ఆరోగ్యంపై ముందుకు సాగుతున్నామని జిల్లా వైద్యాధికారి రజిత పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు నహిమ, వైద్యులు ఓంకార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెటు యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువు సమీపంలో ఏర్పాటు చేయనున్న మార్కెటు యార్డు కోసం నీటి పారుదుల, తహసీల్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రంలో వార సంత ప్రధాన రహదారిపై కొనసాగుతుండడం వల్ల ప్రజలు, చిరు వ్యాపారులు పడుతున్న ఇబ్బందులను ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి మార్కెటు యార్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను ఆదేశించారు. ఈ క్రమంలో యార్డు ఏర్పాటుకు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. అధికారులు భాస్కర్‌రెడ్డి, రత్నం, రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, రవి తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరం



నిమ్మపల్లిలో చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా, ఎల్‌వోసీల ద్వారా ఇప్పటివరకు 20 కోట్లపై చిలుకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పేదలకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 10 సంవత్సరాలలో 400 కోట్లు పంపిణీ చేస్తే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటివరకు 800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, చేపూరి గంగాధర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయిని ప్రభాకర్ రెడ్డి, వెంగలి వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి, బాల్య నాయక్, కాంగ్రెస్ నాయకులు బాల్ రెడ్డి, ఉప్పుల గంగయ్య, సంజీవ్, పెంతల శ్రీనివాస్, మానుక సత్యం, నాగండ్ల భూమేష్, సదానందం పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే..



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గాజుల మల్లయ్య ఫంక్షన్ హాల్‌లో నేతాజీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ విద్యార్థులు చేసిన ఆటాపాటలు అలరించాయి. అనంతరం కళాశాల యాజమాన్యం, అధ్యాపకులను విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపల్లి పృథ్వీధరావు, డైరెక్టర్ జూపల్లి పద్మాదేవి, కరస్పాండెంట్ నాయిని జగన్ మోహన్‌రావు, ప్రిన్సిపాల్ రేశం శ్రీకాంత్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం విద్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఎన్‌రావు, డాక్టర్ రాంకిరణ్ పొలాస సౌజన్యంతో మహిళలకు 30రోజుల ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించారు. సెప్టెంబరు 24న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ 27వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపతిరుపతిరెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ స్వరూపతిరుపతిరెడ్డి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీ పడాలన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో స్వయంఉపాధి కోసం అనేక రంగాలకు సంబంధించిన వాటిపై శిక్షణ ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగన్నపేట హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో నిర్లక్ష్యం

- కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతున్న అధికారులు - టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

గంభీరావుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య నిర్మించతలపెట్టిన హైలెవల్ బ్రిడ్జి పనుల్లో మూడేళ్లుగా నిర్లక్ష్యం కొనసాగుతోందని, అందుకు సదరు కాంట్రాక్టర్‌కు అధికారులు వత్తాసు పలుకుతున్నారని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ఆరోపించారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నిర్లక్షానికి కారణమైన కాంట్రాక్టర్, అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఉపేక్షించే ప్రసక్తి లేదని కటకం పేర్కొన్నారు. గంభీరావుపేట-లింగన్నపేట మధ్య మానేరువాగు వద్ద బుధవారం మృత్యుంజయం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెద్దమ్మ నుంచి లింగన్నపేట వరకు 11 కిలోమీటర్ల రోడ్డును జిల్లా పరిషత్ నుంచి ఆర్‌అండ్‌బీగా మార్పించి తానేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ లోలెవల్ బ్రిడ్జి నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. కొత్త హైలెవల్ బ్రిడ్జి కోసం ఉన్న లోలెవల్ బ్రిడ్జిని కూల్చేసిన సదరు కాంట్రాక్టర్‌పై, కూల్చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పాత బ్రిడ్జి సలాకను వాహనాల్లో తరలించి లక్షల రూపాయలను సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. అమ్మేసిన సలాకను రికవరీ చేయాలన్నారు. కాంట్రాక్టర్ టెండర్‌ను రద్దు చేసి, బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. అదే విధంగా తిరిగి తొందరగా టెండర్ పక్రియను పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్, అధికారులు కుమ్మక్కై ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని నిర్లక్షం చేస్తున్నారని, మూడేళ్ల వ్యవధిలో 10 శాతం పనులు కూడా జరగలేదని ఇలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఖాయమన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిని ఈ బ్రిడ్జి కోసం ఇటీవల కలిసి పరిస్థితిని వివరించామన్నారు. అప్పటికప్పుడే అధికారులతో మంత్రి మాట్లాడారని తెలిపారు. అయినా జిల్లా స్థాయి అధికారులు స్పందించకపోవడంతో ఈఎన్‌సీతో మృత్యుంజయం ఫోన్‌లో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, నాయకులు వెంకటి, మల్యాల రాజవీర్, బాలయ్య, ఎర్ర నర్సయ్య, యెల్ల బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, కిషన్‌గౌడ్, భాస్కర్, మోహన్, రాజు, లింగం, శంకర్, మల్లయ్య తదితరులు ఉన్నారు.



మానేరు వాగు వద్ద మాట్లాడుతున్న కటకం మృత్యుంజయం

కన్నుల పండువగా శివకేశవస్వామి కల్యాణం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని శివకేశవస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం పురోహితులు రాచర్ల విశ్వనాథశర్మ, రాచర్ల శ్రీనివాసశర్మ, కొండపాక శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శివకేశవుల ఆలయ శిఖరముపై కుంభాభిషేకం, హోమం, యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, తదితర కార్యక్రమాలను జరిపించారు. ఆంజనేయస్వామి, సంతాన నాగేంద్ర, నవగ్రహ పునఃప్రతిష్ఠను నిర్వహించారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో వరండలో ప్రత్యేక పందిరిని ఏర్పాటు చేశారు. శివకేశవస్వామి ఉత్సవమూర్తుల ఎదుర్కోళ్లను డప్పుచప్పుళ్ల నడుమ జరిపించారు. ప్రత్యేక పందిరిలో ప్రతిష్ఠించి స్వామి వారి కల్యాణ ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్త జనం అధిక సంఖ్యలో తరలి వచ్చి తిలకించారు. మహిళలు ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శివకేశవుల నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ రామారావు, వైస్ చైర్మన్ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్లు కృష్ణహరి, మల్లేశం, గంగాధర్, సుధాకర్, శ్రీనివాస్, దేవరాజు, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రావు, లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ఆగయ్య, గోపి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు లక్ష్మణ్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, ఆయా పార్టీల నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. మూడు రోజుల పాటు జరిగిన మహోత్సవాలు స్వామి వారి కల్యాణ వేడుకలతో ముగిశాయి.



స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న పురోహితులు

చేనేత పారిశ్రామిక సహకార అభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చేనేత పారిశ్రామిక సహకార అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఉత్పత్తి, వినియోగదారుల సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. నేత కార్మికులకు గడిచిన పదేళ్ల కాలంగా ఉన్న బకాయిలను ప్రజాప్రభుత్వం విడుదల చేస్తుందని, నేత కార్మికుల కోరిక మేరకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని, నేతన్న చేయూత, నేతన్న బీమా వంటి అనేక పథకాల బకాయిలు జమ చేస్తున్నామని అన్నారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటుచేసి ఇప్పటివరకు 100 సొసైటీలకు 2500 మెట్రిక్ టన్నుల నూలు దారం అందించామని అన్నారు. వస్త్ర పరిశ్రమలో ఆధునిక సాంకేతిక తను పెంచేందుకు హ్యాండ్లూమ్ యూనివర్సిటీ, ఐఐహెచ్‌టి ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. రైతుల తరహాలోని నేత కార్మిక కుటుంబాలకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతన్న బీమా పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఈ పథకంలో నమోదు కాబడిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఐదు లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. జిల్లా పరిధిలో చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ పథకం ద్వారా ఇప్పటి వరకు 15.62 లక్షల మంది చేశారన్నారు. ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికరంగా ఉన్నా పేద ప్రజలపై పన్నుల భారం మోపకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కడసారి చూపు కోసం ఎదురుచూపు..

- నేడు స్వగ్రామంలో 'కోసా' అంత్యక్రియలు



కోసా మృతదేహాన్ని అన్న కరుణాకర్‌రెడ్డికి చూపిస్తున్న పోలీసులు

6

అశ్వ వాహనంపై ఊరేగిన స్వామివారు..

- ప్రత్యేక పూజలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్



అశ్వవాహనంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

7

ఆర్‌ఎంపీపై హత్యాయత్నం కేసులో పురోగతి

● పోలీసుల అదుపులో నిందితుడు

కోల్‌సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో సంచలనం సృష్టించిన పరంకుశం యశ్వంత్(36)పై జరిగిన హత్యాయత్నం కేసు కొలిక్కి వచ్చింది. తొమ్మిది నెలలుగా పోలీసులు ఈ కేసును చేధించేందుకు ముప్పుతిప్పలు పడ్డారు. గోదావరిఖని కోదండరామాలయ సమీపంలోని సింగరేణి క్వార్టర్‌లో ఆర్‌ఎఫ్‌సీఎల్ అవుట్ సోర్సింగ్, ఫిజీషియన్ అసిస్టెంట్ అయిన యశ్వంత్‌పై జనవరి 7న హత్యాయత్నం జరిగింది. ఇంటి వెనుక నుంచి ఇంట్లోకి చొరబడిన దొంగలు కత్తులతో అతని తల, ముఖంపై దాడి చేశారు. ఆ సమయంలో యశ్వంత్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఆయన భార్య ప్రతిమ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. యశ్వంత్ హత్యాయత్నం కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. దాడికి పాల్పడిన నిందితులు ఇంట్లోని ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లలేదు. వేలి ముద్రలు పడకుండా జాగ్రత్తపడ్డారు. గోదావరిఖని ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, క్రైం టీమ్ వివిధ కోణాల్లో విచారణ జరిపారు. ఒక సమయంలో కాల్‌డాటాను విశ్లేషించిన పోలీసులు కుటుంబ సభ్యులు, బంధువులను విచారించారు. యశ్వంత్ ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో నిందితుడి ముఖం రికార్డు కావడంతో దాని ఆధారంగా విచారణ చేపట్టారు. ఎట్టకేలకు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా మరికొందరిని విచారిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

శంషాబాద్ గ్రామంలో గంజాయి కలకలం

మానకొండూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని శంషాబాద్ గ్రామంలో బుధవారం గంజాయి దొరికిందన్న విషయం కలకలం రేపింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్ నుంచి మంగళవారం వచ్చాడు. ఇంటికి వెళ్లకుండా అర్ధరాత్రి బ్యాగుతో రోడ్డు వెంబడి అనుమానాస్పదంగా వెళుతున్నాడు. గమనించిన కొందరు అతన్ని ప్రశ్నించగా బ్యాగును వదిలిపెట్టి పరారయ్యాడు. బ్యాగును పరిశీలించగా అందులో సుమారు 20గంజాయి ప్యాకెట్లు, ఫొటోలు, ఆధార్‌కార్డు, పర్సు ఇతర సామాను ఉన్నాయి. బుధవారం గ్రామంలో గంజాయి లభించిందన్న సమాచారం గుప్పుమనడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లభ్యమైన బ్యాగును పరిశీలించి గంజాయితో పాటు బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై సీఐ సంజీవ్‌ను సంప్రదించగా సంఘటనపై విచారణ చేపట్టామని తెలిపారు.


హుజూరాబాద్‌లో కారు దగ్ధం

హుజూరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో ప్రమాదవశాత్తు కారు దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. విద్యానగర్‌లో సూపర్‌మార్కెట్ నిర్వహిస్తున్న కొమురవెల్లి సంతోష్ తన కారును మంగళవారం సాయంత్రం సర్వీసింగ్ చేయించి ఇంటిముందు పార్కింగ్ చేశాడు. బుధవారం ఉదయం గుడికి వెళ్దామని కారును స్టార్ట్ చేయగా, ఒక్కసారిగా ఇంజన్ నుంచి పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. వెంటనే సంతోష్ కారులో నుంచి బయటకు వచ్చి మంటలను ఆర్పడానికి ప్రయత్నించాడు. మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా, అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్‌సర్క్యూట్ తోనే మంటలు వ్యాపించాయని అగ్నిమాపక సిబ్బంది ప్రాథమికంగా నిర్ధారించారు. సుమారు రూ.6లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు సంతోష్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ధర్మారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి రాజశేఖర్(34) ఈనెల 21న చుట్టపు చూపుగా పత్తిపాక గ్రామానికి చెందిన మోదుంపల్లి అంజయ్య ఇంటికి వచ్చాడు. రాజశేఖర్‌కు పదేళ్ల క్రితం వివాహమైంది. అయితే పిల్లలు పుట్టకపోవడంతో మనస్తాపంతో ఉండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన రాజశేఖర్ పత్తిపాక చెరువుకట్టపై గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు అంజయ్యకు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. రాజశేఖర్ తల్లి దాసరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కడసారి చూపు కోసం ఎదురుచూపు



● సత్యనారాయణరెడ్డి(కోసా) మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి
● సోదరుడికి మృతదేహం అప్పగించిన పోలీసులు
● ఛత్తీస్‌గఢ్ నుంచి బయలుదేరిన కుటుంబ సభ్యులు
● నేడు స్వగ్రామం గోపాల్‌రావుపల్లిలో అంత్యక్రియలు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అబూజ్‌మడ్‌లో ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లికి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా అలియాస్ గోపన్న అలియాస్ సాధు కడసారి చూపు కోసం కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామస్థులు, మిత్రులు ఎదురుచూస్తున్నారు. సత్యనారాయణరెడ్డి మృతదేహం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో



కోసా మృతదేహంతో అంబులెన్స్ వద్ద కరుణాకర్‌రెడ్డి

భద్రపరిచారు. మృతదేహాన్ని చూసి అన్న కరుణాకర్‌రెడ్డి కన్నీటి పర్యంతం అయ్యారు. తమ్ముడి మృతదేహాన్ని తీసుకు వచ్చేందుకు గోపాల్‌రావుపల్లి నుంచి ఛత్తీస్‌గఢ్ వెళ్లారు. వీరు మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు వరకు నారాయణ్‌పూర్ చేరుకున్నారు. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు గుర్తుపట్టి సత్యనారాయణరెడ్డేనని తేల్చి సంతకం చేశాక బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పోస్టుమార్టం పూర్తయింది. తర్వాత మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు నారాయణ్‌పూర్‌లో అంబులెన్స్ అద్దెకు తీసుకునే వరకు ఆలస్యం అయ్యింది.

ఛత్తీస్‌గఢ్ నుంచి 450 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోసా స్వగ్రామానికి అంబులెన్స్ అద్దెకు ఇవ్వడం ఎవరు ముందుకు రాలేదు. చివరికి మృతదేహాన్ని నారాయణ్‌పూర్ జిల్లా ఆసుపత్రి నుంచి తీసుకొని కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి 8 గంటలకు బయలుదేరారు. అంబులెన్స్ సిరిసిల్లకు చేరడానికి దాదాపు 10 గంటలు పడుతుంది. గురువారం ఉదయం వరకు కోసా మృతదేహం స్వగ్రామమైన గోపాల్‌రావుపల్లి చేరనుంది. విప్లవబాట పట్టిన నుంచి 45 సంవత్సరాల తర్వాత శవమై స్వగ్రామమైన గోపాల్‌రావుపల్లికి వస్తుండంతో కడసారి చూపు కోసం ఎదురు చూస్తున్నారు. ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. మృతదేహం తీసుకురావడం ఆలస్యం కావడంతో గోపాల్‌రావుపల్లిలో గురువారం ఉదయం అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు.

గట్టు వామన్‌రావు ఇంటికి సీబీఐ అధికారులు

మంథనిరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామంలోని గట్టు వామన్‌రావు ఇంటికి సీబీఐ అధికారుల బృందం బుధవారం మరోసారి వచ్చినట్లు తెలిసింది.. కుటుంబ సభ్యులను కలిసిన అధికారుల బృందం కేసుకుసంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించినట్లు సమాచారం. హత్యకు గురైన న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు, నాగమణిల కేసువిచారణ కోసం వామన్‌రావు తండ్రి కిషన్ రావును, కుటుంబ సభ్యులను ఈనెల18న సీబీఐఅధికారుల బృందం గుంజపడుగులో వారి ఇంట్లో కలిశారు. కేసు దర్యాప్తులో భాగంగా మరోసారి సీబీఐ అధికారుల బృందం వామన్‌రావు కుటుంబ సభ్యులను కలిసినట్లు తెలుస్తోంది.

రూ.6050 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌యార్డులో క్వింటాల్ పత్తి ధర రూ.6050 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 18మంది రైతులు 98క్వింటాళ్ల విడి పత్తి, 13మంది రైతులు 22క్వింటాళ్ల గోనెసంచుల్లో కొత్త పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.6050, కనిష్ఠ ధర రూ.4500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

అడవిని నరికివేశాడని చనిపోయిన వ్యక్తిపై కేసు

● నేడు కోర్టుకు హాజరు కావాలని కుటుంబ సభ్యులకు సమన్లు
● ఫారెస్ట్ అధికారుల వింత వ్యవహారం

కథలాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం రాజారాం తండాకు చెందిన భూక్యా కీమ్యానాయక్ నాలుగేళ్లక్రితం మృతి చెందగా అడవిని నరికివేశాడని పోలీసులు రెండేళ్లక్రితం కేసు నమోదు చేశారు. భూక్యా కీమ్యానాయక్ 2020ఆగస్టు 31న అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. అయితే ఫారెస్ట్ అధికారులు కీమ్యానాయక్ గ్రామ సమీపంలోని అడవిని నరికివేసి భూమి చదును చేశాడని ఈనెల 25న కోర్టుకు హాజరు కావాలని కుటుంబ సభ్యులకు సమన్లు పంపడంతో ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన పదిమంది అడవిలోకి అక్రమంగా ప్రవేశించి అటవీ భూములను చదును చేశారంటూ ఓ ఫారెస్ట్ అధికారి రెండేళ్ల కిందట కేసు నమోదు చేశారు. గ్రామంలో ఎలాంటి విచారణ చేయకుండానే హడావుడిగా సదరు అధికారి కేసులు నమోదు చేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

దొరిగిన బంగారం పోలీసులకు అప్పగింత

● మానవత్వాన్ని చాటిన భార్యాభర్తలు

హుజూరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ భార్యభర్తలు 13తులాల బంగారం దొరికిందని పోలీస్‌స్టేషన్లో అప్పగించి మానవత్వాన్ని చాటిచెప్పిన సంఘటన హుజూరాబాద్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన రెడ్డబోయిన రమేష్ మూడురోజుల క్రితం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామం నుంచి 13 తులాల బంగారు నగలను బ్యాగ్‌లో పెట్టుకొని హుజూరాబాద్‌కు వస్తున్నాడు. మార్గమధ్యలో ఇప్పల్ నర్సింగాపూర్ గ్రామ శివారులో ఆ బ్యాగ్ బైకెవెనుక నుంచి జారీ కింద పడిపోయింది.

బంగారాన్ని పోగొట్టుకున్న రమేష్ ఆందోళనతో హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలో హుజూరాబాద్ మండలం ఇప్పల్ నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సమ్మయ్య, నఫీజ దంపతులకు ఆ బ్యాగ్ దొరికింది. బ్యాగ్‌ను చూసిన వారు విలువైన వస్తువులు ఉన్నాయని గ్రహించి వెంటనే పోలీసులకు అప్పగించారు. పోలీసులు రమేష్‌ను పిలిపించి టౌన్‌సీఐ కరుణాకర్ సమక్షంలో 13తులాల బంగారు నగలను తిరిగి అప్పగించారు. నిజాయితీగా దొరికిన బంగారాన్ని పోలీస్ స్టేషన్లో అప్పగించిన సమ్మయ్య, నఫీజ దంపతులను టౌన్ సీఐ కరుణాకర్ సన్మానించి, అభినందించారు.



బంగారం ఇచ్చిన దంపతులను సన్మానిస్తున్న సీఐ కరుణాకర్

గిరిజన తండాల్లో ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

● 250 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం.. ● 20 లీటర్ల సారా స్వాధీనం ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుడుంబా స్థావరాలపై అబ్కారీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మారుమూల గిరిజన పల్లెల్లో తయారీ, రవాణాపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 21న 'గుట్టుగా గుడుంబా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎక్సైజ్ అధికారులు బుధవారం ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని వీర్నపల్లి మండలం మద్దిమల్ల, లొద్దితండా, గోల్యానాయక్‌తండా, బావుసింగ్‌తండా, బంజారుతండా, భూక్యతండా, రాశిగుట్టతండాలపై సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని



బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

దాడులు నిర్వహించారు. నాటు సారా తయారీకేంద్రాలను కనుగొన్నారు. వ్యవసాయ పొలాలు, ఇళ్ల సమీపంలో నిల్వ చేసిన 250లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 20లీటర్ల నాటు సారాను స్వాధీన పర్చుకున్నారు. గుడుంబా తయారీ, రవాణా, అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. తమకు సమాచారం అందించిన వారివివరాలను గోప్యంగా ఉంచు తామని, సారా నియంత్రణకు పాటుపడాలని కోరారు. దాడుల్లో సిబ్బంది రాకేశ్, వర్మ, రాజు, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

మర్రిగడ్డలో ఒకరి ఇంట్లో చోరీ

చందుర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మరిగడ్డ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఒకరి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. చందుర్తి ఎస్సై రమేష్ కథనం ప్రకారం... మండలంలోని మర్రిగడ్డ గ్రామానికి చెందిన బైరగోని అనిత మంగళవారం రాత్రి 11 గంటల వరకు టీవీ చూస్తూ నిద్రపోయింది. తెల్లవారుజామున 5 గంటలకు భర్త తలుపులు తెరిచి పొలం పనులకు వెళ్లాడు. నిద్ర నుంచి మేల్కొన్న అనిత చూసేసరికి బంగారు పుస్తెలతాడుతో పాటు సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కేసీఆర్ నగర్ కాలనీ సమీపంలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పింది. ఈ సంఘటనలో మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు నర్సింలు, హరికృష్ణలు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నర్సింలు, హరికృష్ణలు తమ బైక్‌పై వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన శంకరపట్నం మండలం కన్నాపూర్‌లో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్త గ్రామానికి చెందిన దొంతుల శ్రీనివాస్ తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు కన్నాపూర్‌కు వచ్చి తిరిగి మక్తకు వెళ్తుండగా స్కూల్‌వద్ద మోటర్ సైకిల్ అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలు కావడంతోపాటు ఎడమచేతి వేళ్లు విరిగి రోడ్డు మీదపడ్డాయి. గమనించిన స్థానికులువెంటనే 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

27న ద్విచక్ర వాహనాల స్క్రాప్ బహిరంగ వేలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న యజమానులు తెలియని 57 ద్విచక్రవాహనాలకు ఈనెల27న బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. 27న మధ్యాహ్నం 2.30గంటలకు సీటీసీలో వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలం వేసే వాహనాలను 27వ తేదీన ఉదయం 11 గంటల నుంచి పరిశీలించవచ్చని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు తప్పనిసరిగా కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డును సమర్పించాలన్నారు. వేలంపాటలో విజేతగా నిలిచినవారు, తాము కొనుగోలు చేసిన వాహనాలకు పూర్తి మొత్తంతో వేలం నిర్వహణ సంస్థ కమిషనర్‌కు అక్కడికక్కడే నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు. కొనుగోలుదారులు పోలీస్ అధికారుల సూచనల మేరకు వాహనాలను కట్ చేసి, తమ సొంత ఖర్చులతో తరలించుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గన్నేరువరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామంలోని మోయతుమ్మెద వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద బుధవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒకరి అదృశ్యం

కథలాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌కు చెందిన నేతి కుంట రాజరెడ్డి (58) అనేవ్యక్తి అదృశ్యమయ్యాడు.



రాజరెడ్డి(ఫైల్)

రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన రాజరెడ్డి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుంతలమయంగా హుజూరాబాద్ ఆర్టీసీ బస్టాండ్

● ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లు.. ప్రయాణికులు



బస్టాండ్‌లోని రోడ్డుపై ఏర్పడిన గుంత, పగుళ్లు బారిన సీసీ రోడ్డు

హుజూరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని రోడ్డంతా గుంతలమయంగా అధ్వానంగా తయారైంది. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో డ్రైవర్లు, ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. హుజూరాబాద్ బస్టాండ్ నుంచి నిత్యం ప్రజలు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, హుస్నాబాద్, నిజామాబాద్, తిరుపతి, రాజమండ్రి, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో వర్షం పడితే నీళ్లుపోయే దారిలేక బస్టాండ్ ఆవరణలోనే నిలిచి పోతున్నాయి. దీంతో బస్టాండ్ నుంచి బయటకు వెళ్లే దారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు బస్టాండ్‌లోకి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. గుంతల్లో నుంచి బస్సులు వెళ్తుండడంతో బస్సుల కమన్ పట్టీలు విరుగుతున్నాయని డ్రైవర్లు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా గుంతలు పడిఉన్నా ఆర్టీసీ అధికారులు మాత్రం మరమ్మతులు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దీనిపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నంప్రభాకర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సామాజిక కార్యకర్త నలబాల వేణుగోపాల్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలోని గుంతలను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎండపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కొద్దిరోజుల క్రితం గాయపడిన ఎండపల్లి మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు పొన్నం రవిగౌడ్(55) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మూడురోజుల క్రితం రవిగౌడ్ కల్లు గీసుకొని గుళ్లకోట శివారులో తన ద్విచక్రవాహనంపై వస్తుండగా వెల్గటూర్ మండలం శాఖాపూర్‌గ్రామానికి చెందిన పికప్‌వాహనం ఢీకొట్టింది. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సచేస్తుండగా మరణించాడు. మృతుడికిభార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయంచేయాలని గ్రామస్థులు, కుటుంబసభ్యులు రాజారాంపల్లి చౌరస్తావద్ద మృతదేహంతో బుధవారం ఆందోళన చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని వెల్గటూర్ ఎస్‌ఐ ఉమాసాగర్ హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.

నేడు ఇసుక వేలం

గంగాధర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంగాధర తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఇసుక వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రజిత తెలిపారు. బుధవారం ఆమె పత్రిక ప్రకటన విడుదల చేశారు. మండలంలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. పట్టుబడిన నాలుగు ట్రాక్టర్ల ఇసుకను గురువారం వేలం వేస్తున్నామని, ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆమె తెలిపారు.

అడవిలో చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకుంటాం

రుద్రంగి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మానాల అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విజిలెన్స్ అధికారి ముకుందరెడ్డి అన్నారు. రుద్రంగి మండలం మానాల గ్రామంలో భారీసంఖ్యలో నీలగిరి చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని వారంరోజులుగా గ్రామస్థులు చేస్తున్న నిరసనలకు బుధవారం రాష్ట్ర విజిలెన్స్ అధికారి ముకుందరెడ్డి, ఫారెస్ట్ అధికారులతో కలిసి ధ్వంసమైన చెట్లను పరిశీలించారు. మానాల గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫారెస్ట్ భూముల్లో ఎవరైనా చెట్లను నరికితే కేసులు నమోదు చేస్తామన్నారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా వేసిన బోరుబావుల్లోని విద్యుత్ మోటర్‌లను స్వాధీనం



మానాల గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

చేసుకున్నామన్నారు. భూములు చదును చేయడానికి సహకరించిన ఫారెస్ట్ అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలలు జైలు

కొడిమ్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇస్లాంపురకు చెందిన లక్ష్మి అనే మహిళకు చెందిన ఇంటి తాళం పగులగొట్టి 2025లో దొంగతనం చేసిన నిందితుడు రేగుల అజయ్‌కుమార్‌కు సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.లావణ్య ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇస్లాంపుర గ్రామానికి చెందిన లక్ష్మి పని నిమిత్తం ఇంటికి తాళం వేసి గత మార్చి 28న కరీంనగర్‌కు వెళ్లగా నిందితుడు ఇంటిలోని బంగారం, నగదు ఎత్తుకు పోయారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. నిందితుడు అజయ్‌కుమార్‌ను కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆవులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● రుద్రంగిలో యువకుల ధర్నా

రుద్రంగి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆవులను అక్రమంగా సరఫరా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నంద్యాడపు వెంకటేష్ డిమాండ్ చేశారు. రుద్రంగి మండల కేంద్రంలో రాత్రి ట్రాలీ ఆటోలో రెండు గోవులను తరలిస్తున్న విషయం తెలుసుకున్న భవాని దీక్షాపరులు, గోసంరక్షణ టీం సభ్యులు కలిసి ఆవులను తరలిస్తున్న ఆటోను అడ్డుకున్నారు. అయితే గోవులను తరలిస్తున్న వ్యక్తిని, తరలిస్తున్న ఆటోను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేయాలని మండలకేంద్రం శివారులోని గండి వేంకటేశ్వర్లస్వామి ఆలయ సమీపంలో యువకులు ధర్నాకు దిగారు. పోలీసులు అక్కడికి చెరుకొని ఆటోను సీజ్ చేయడంతో పాటు, ఆవులను తరలిస్తున్న వ్యక్తిపై కేసులు నమోదు చేస్తామనడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమలో భవాని దీక్షదారులు, యువకులు పాల్గొన్నారు.



రుద్రంగిలో ధర్నా చేస్తున్న భవాని దీక్షాపరులు



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న కూరగాయలు

కూరగాయల సాగు బహుబాగు



చిక్కుడు పంట

అధిక దిగుబడి సాధిస్తున్న రైతు

కథలాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన దాసరి గంగాధర్ అనే రైతు కూరగాయలు సాగు చేస్తూ రోజూ రూ.10 వేల వరకు సంపాదిస్తున్నాడు. గంగాధర్ తనకున్న మూడెకరాల భూమిలో సీజన్‌కు అనుగుణంగా పలు రకాల కూరగాయలు సాగు చేస్తున్నాడు. కాకర, చిక్కుడు, టమాట, వంకాయ, బీర వంటి కూరగాయలను సాగు చేయడానికి సుమారు రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టాడు. మండలంలో ప్రతీ దినం ఎక్కడో ఓ గ్రామంలో జరిగే అంగడికి కూరగాయలు తీసుకెళ్లి విక్రయిస్తూ ఖర్చులు పోను రోజు రూ.10 వేలు సంపాదిస్తున్నాడు. గంగాధర్ గతంలో మాజీ సర్పంచ్‌గా పనిచేయగా ప్రస్తుతం సింగిల్ విండో చైర్మన్‌గా ఉన్నాడు.

బంతిపూల సాగుతో అదనపు ఆదాయం

పసుపు, లేత గులాబీ రంగులో ఉన్న బంతి పూల పంటను సైతం సాగు చేస్తూ అదనపు ఆదాయం సమకూర్చుకోవడం విశేషం. దసరా, దీపావళి, బతుకమ్మ పండుగలకు బంతిపూలకు డిమాండ్ అధికంగా ఉండడంతో లాభాలు ఆర్జించేందుకు అవకాశం ఏర్పడింది.

కూరగాయల సాగుతో ఆదాయం

దాసరి గంగాధర్, రైతు



ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది. మూడెకరాల విస్తీర్ణంలో బీర, కాకర, చిక్కుడు, టమాట వంటి కూరగాయలతో పాటు బంతి పూల పంటను సాగు చేస్తున్నాను. కూలీలు, ఇతరత్రా ఖర్చులు పోను ప్రతీ రోజు దాదాపు రూ.10 వేలు సంపాదిస్తున్నాను. మండలంలో చుట్టు పక్కల ఉన్న అంగళ్లకు వాహనంలో కూరగాయలు తీసుకుకెళ్లి అమ్ముకుని ఉపాధి పొందుతున్నా.

చంద్రఘంట అలంకారంలో అమ్మవారు

ఘనంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం



వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవినరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో మూడవ రోజు స్వామి వారికి విశిష్ట పూజలు నిర్వహించారు. లక్ష్మీగణపతి స్వామికి అధర్వశీర్ష పఠనంతో అభిషేకం, రాజరాజేశ్వర స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వర అమ్మవారికి మహాభిషేకం, షష్టి ఉపచార పూజలు, గాయత్రి హోమంతో పాటు పరివార దేవతల ఆరాధన, పారాయణాలు, దేవీ భాగవత పురాణ ప్రవచనాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వాహన సేవతో ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

ధర్మపురిలో



ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రోత్సవాలు మూడవ రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడవ రోజు అమ్మవారు చంద్రఘంటాదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. టీటీడీ కళ్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి, చింతామణి చెరువు వద్ద మహా శక్తి సేవా సమితి, తిమ్మాపూర్ శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో, ఒజ్జల వీధిలో, నేరెళ్లలో అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్ పాల్గొన్నారు.

కొండగట్టులో అన్నపూర్ణాదేవిగా..

మల్యాల: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగుతున్న దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఊరేగిన స్వామి వారు



అశ్వవాహనంపై కొలువుదీరిన శ్రీస్వామి వారు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మూడో రోజు శ్రీదేవినవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం శ్రీస్వామి వారి ఉత్సవమూర్తుల పెద్దసేవతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా, వాతవరణంలో మార్పు కారణంగా అశ్వవాహనంపై ఉత్సవమూర్తులను నిలిపి అంతరాలయంలో పెద్దసేవ నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలో పాల్గొని పెద్ద సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈవో రమాదేవి, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్ బీజేపీ సీనియర్ నేత ప్రతాప రామకృష్ణ తదితరులు ఉన్నారు.

శ్రీరాంసాగర్ నుంచి 3,35,160 క్యూసెక్కులు నీరు విడుదల

జగిత్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 40 గేట్లు పైకి ఎత్తి 3,35,160 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 62.673 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరుకు 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టుకు బుధవారం 8000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దిగువకు 4గేట్ల ద్వారా 9000 క్యూసెక్కులు ప్యాకేజీ 9లోని మల్కాపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కులు నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.84 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.14టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతల నిలిపివేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలను నిలిపివేశారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.29టీఎంసీలకు నీరు చేరుకుంది. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు నీటి ఎత్తిపోతలు నిలిపివేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

ఎల్‌ఎండీలోకి తగ్గుతున్న ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీకి ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి 24వేల క్యూసెక్కుల నీటిని ఎల్‌ఎండీ స్పిల్‌వే గేట్ల నుంది దిగువకు విడుదల చేస్తున్న అధికారులు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు 16వేల క్యూసెక్కులకు తగ్గించారు. ఎల్‌ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.732 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 7520 క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 9వేల క్యూ సెక్కులు, ఎగువకాకతీయ కాలువ నుంచి 4వందల క్యూసెక్కులు మొత్తం 16,920 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తున్నాయి. ఎల్‌ఎండీ 8గేట్ల నుంచి 16వేలు, కాకతీయ కాలువ నుంచి 3వేల క్యూ సెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309 క్యూసెక్కులు మొత్తం 19,309 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి సీతక్క



ఎల్‌ఎండీ కాలనీలోని మహిళా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తిమ్మాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళాలు ఆర్థికంగా ఎద గాలని మహిళా సంక్షేమం, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని ఎల్‌ఎండి కాలనీలో గల దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం)లో పలు అంశాల్లో శిక్షణ పొందిన మహిళాలకు ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అనేక మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రం చాలా ఉపయోగపడుతుందని అన్నారు. అదే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి కోటి మంది మహిళాలను మహిళా సంఘాల్లో చేర్పించి వారిని కోటీశ్వరులుగా చేయండి అని ఆదేశించారన్నారు.

తాము అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి మహిళలకు 27 వేల కోట్ల వరకు వడ్డీ లేని రుణాలను ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో 10 మహిళా ప్రాంగణాలు ఉన్నాయని, వాటిలో మహిళలకు ఆసక్తి ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో 10 కోట్ల రూపాయలను కేటాయించామన్నారు. నారాయణపేట జిల్లాలో 11 మంది సభ్యులున్న మహిళా సంఘానికి పెంట్రోల్ బంక్ ఇచ్చామని, వారు ఆరునెలల్లో అన్ని ఖర్చులు పోను 13.8 లక్షల రూపాయలు సంపాదించారని తెలిపారు. మహిళలందరు మహిళా సంఘాలలో చేరాలని పిలుపునిచ్చారు.

మహిళలకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్

మంత్రి పొన్నం ప్రభాకర్

ఈ-ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు రవాణా శాఖ నుంచి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు అందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ స్ఫూర్తితో హైదారాబాద్‌లోనూ మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించి లైసెన్సులు ఇస్తామన్నారు. మహిళా ప్రాంగణానికి అదనపు ఆదాయ వనరులు సమకూర్చేందుకు వీలుగా పెట్రోల్ బంక్ నెకొల్పే యోచన ఉందన్నారు. త్వరలో ఇది కార్యరూపం దాల్చుతుందని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పాడ్డాక మహిళలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆర్టీసీలో మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేశామని, ఉమ్మడి జిల్లాలో 47 బస్సులు మహిళా సంఘాల ద్వారా అద్దెకు నడుస్తున్నాయన్నారు. వాటి ద్వారా మహిళా సంఘాలు నెలకు 70 వేల వరకు ఆదాయం పొందుతున్నాయని తెలిపారు. మహిళలంతా ప్రభుత్వపరంగా ఆర్థిక ప్రయోజనం పొందాలంటే తప్పకుండా మహిళా సంఘాల్లో చేరాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.



- మహిళలు అన్ని రంగాల్లోనూ ముదుండాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన మహిళలను కేంద్ర మంత్రి బండి సంజయ్ తొమ్మిఇది ఆటోలను, తాను రెండు ఆటోలను సమకూర్చామని తెలిపారు. ఈ ఆటోలకు మా అక్క ఆటో అని కలెక్టర్ పమేలా సత్పతి పేరు పెట్టారని తెలిపారు.



- తెలంగాణను జీరో క్రైంగా స్టేట్‌గా మార్చేందుకు కృషి చేయాలని తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. రాష్ట్ర మహిళా కోఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి మాట్లాడుతూ మహిళా ప్రాంగణాల్లో విభిన్న రంగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రతి మహిళ స్వయం సమృద్ధి సాధించాలన్నారు. జిల్లా యంత్రాంగం అందిస్తున్న వివిధ శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. మహిళలతో మంత్రి సీతక్క, నేరెళ్ల శారద, బండ్రు శోభరాణి, కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు, మహిళా సంఘాల సభ్యులతో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ప్రాంగణం మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మంత్రులు పొన్నం, సీతక్కకు పోలీస్ సంఘం వినతి



మంత్రులు సీతక్క, పొన్నంకు వినతిపత్రం అందజేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది పెండింగ్ బిల్లులు పండుగకు ముందే చెల్లించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కరీంనగర్ జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు, ఎస్ఐ మామిడాల సురేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కరీంనగర్‌లో బుధవారం మంత్రులకు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో ఇతర ప్రభుత్వ శాఖలకు పీఆర్‌సీ బకాయిలు చెల్లించినప్పటికీ, కరీంనగర్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సిబ్బందికి మాత్రం ఇంతవరకు పెండింగ్ బిల్లులు అందలేదని కరీంనగర్ జిల్లా పోలీస్ సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. జనవరి 2024 నుంచి రావలసిన సరెండర్స్, అడిషనల్ సరెండర్స్, 6 నెలల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలు, 2018 పీఆర్‌సీ బకాయిలు, ఇతర జిల్లాలకు చెల్లించినప్పటికీ కరీంనగర్ జిలాకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వినతిపత్రంలో ప్రస్తావించారు. తమ ఇబ్బందులను అర్థం చేసుకుని బకాయిలు వెంటనే మంజూరు చేయాలని పోలీస్ సంఘం కోరింది.

భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

కరీంనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామస్థాయిలో ప్రజలకు, రైతులకు మేలు జరగాలనే ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి గ్రామ పాలన అధికారులకు సూచించారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలందించి భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రెవెన్యూ గార్డెన్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో గ్రామపాలన అధికారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూభారతి చట్టం, విధులు, బాధ్యతలతోపాటు పారదర్శకత, అంకితభావం తో కూడిన పౌరసేవలపై దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ రైతాంగానికి, ప్రజలకు మెరుగైన సేవలను క్షేత్ర స్థాయిలోనే అందించాలనే సంకల్పంతో పాటు గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం, పునర్నిర్మాణంలో భాగంగా సీఎం రేవంద్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంపూర్ణ సహకారంతో జీపీవో వ్యవస్థ ఏర్పాటు సాధ్యమైందని అన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

గతంలో ఐదువేల మంది ఉంటే నేడు 10వేల పైచిలుకు రెవెన్యూ ఉద్యోగులను రెవెన్యూ శాఖలోకి తీసుకోవడం జరిగిం దని చెప్పారు. జీపీవోలు ఏ ఒక్కరు తప్పుచేసినా అది మొత్తం వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందని అన్నారు. కారుణ్య నియామకాలకు సంబంధించి త్వర లోనే తీపి కబురు వస్తుందని చెప్పారు. ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి సారథ్యంలో గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా మని టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి అన్నారు. టీజీటీఏ జనరల్ సెక్రెటరీ రమేశ్ పాక మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు యువత ఎంత కీలకమో, రెవెన్యూ వ్యవస్థకు జీపీవోలు అంతే కీలకమని అన్నారు. కార్యక్రమంలో టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర నాయకులు వి.బిక్షం, చిల్లా శ్రీనివాస్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, రమేశ్, టీజీటీఏ నగర కార్యదర్శి రాజేశ్వరి, నవాజ్ షరీఫ్, రిటైర్డు తహసీల్దార్ గంప శంకరయ్య, మల్లారం అర్జున్, ఆంజనేయప్రసాద్, సాయి కిషోర్, బాపుదేవ్ పాల్గొన్నారు.

పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి

కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి



పిల్లలను దత్తత ఇస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్/ కరీం నగర్ క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులు చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకుంటే ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తవని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిశు గృహంలో పెరుగుతున్న ఆరు నెలల వయసున్న ఇద్దరు శిశువులను విశాఖపట్నం, మేడ్చల్ మల్కాజ్‌గిరికి చెందిన పిల్లలు లేని దంపతులకు కలెక్టర్ చేతుల మీదుగా దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనాథ శిశువుల దత్తత, రక్త సంబంధీ కుల నుంచి దత్తత తీసుకోవా లనుకునే వారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో పర్వీన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, ఎల్‌సీపీవో తాటిపల్లి రాజు, రాజ్ కుమార్, సాదినేని రమేశ్ పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం బైక్ యాత్ర



బైక్‌పై ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం సూర్యాపేట, మద్దిరాల మండలం గోరంట్ల గ్రామ జీడీపీ హెచ్‌ఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాచకొండ ప్రభాకర్ బైక్‌యాత్ర చేపట్టారు. యాత్రను సోమవారం సూర్యాపేట ఎస్పీ ప్రారంభించగా ప్రభాకర్ ఉమ్మడి 10 జిల్లాల్లో దసరా సెలవులంతా యాత్ర చేయనున్నారు. బుధవారం తెలంగాణ చౌక్ వద్ద ఆయన ఆగి పాదచారులు, వాహనదారులకు గంజాయి, డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కోసమే యాత్ర చేస్తున్నాని, తన యాత్రతో కొంతైనా మార్పు వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

రాజన్న ఆలయానికి దాతల విరాళాలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి పలువురు వ్యక్తులు బుధవారం విరాళాలు అందించా రు. జగిత్యాల జిల్లా బ్రాహ్మణవాడకు చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి లక్షా 116 రూపాయల చెక్కును ఆలయాధికారులుకు అందించారు. రాజన్న ఆలయ గోశాలకు హైదరాబాద్ సరూర్‌నగర్‌కు చెందిన ప్రణమ్య ఎలక్ట్రికల్‌కు చెందిన సుమన్‌శర్మ అనే వ్యక్తి 10 పెద్ద విద్యుత్ వీధి దీపాలను ఈవో రమాదేవికి అందించారు.

టెట్ సమస్యను పరిష్కరించాలని వినతి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టెట్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ అంజిరెడ్డికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించి టెట్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాత్ సురేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌రావు, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, తిరుపతి, రాష్ట్ర కార్యదర్శులు వెంకటరమణ, సుభాషి భాస్కర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వర్, తిరుపతిరావు, సునీల్ రెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో కీలకం



నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫార్మసిస్టులు ఆరోగ్య సరంక్షణ, రోగి శ్రేయస్సులో సమగ్ర పాత్ర పోషి స్తారు. ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులు పోషించే పాత్రను గుర్తించి వారిని అభినందించేందుకు అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని 2009 నుంచి నిర్వహిస్తున్నది. ఫార్మసిస్టులు ఎప్పటి నుంచే మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో భాగమయ్యారు. వారు కౌంటర్ వెనక నిశ్శబ్దంగా పనిచేసే హీరో లు. కాని వారి ప్రభావం ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో కీలకంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీరిని గౌరవిస్తూ ఫార్మ సిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్మసిస్టులు మందులను సురక్షితంగా వినియోగించడంపై రోగులకు అవగాహన కల్పిస్తారు. ఆరోగ్య సరంక్షణ, పర్యావరణ వ్యవస్థలో సహకారాన్ని ప్రోత్సహిస్తుంది.

ఉద్యోగమే కాదు పవిత్రమైన బాధ్యత...

టి రామారావు, ఫార్మాసిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి



ఫార్మాసిస్టు అనేది ఉద్యోగమే కాదు పవిత్రమైన బాధ్యత. వైద్యుడి సూచనను శాస్త్రీయంగా అమలు చేసే బాధ్యత ఉన్న వ్యక్తి ఫార్మాసిస్టు. ఫార్మసిస్టులు కూడా విధినిర్వహణకు సంబందించిన సమ స్యలతో బాధపడుతున్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

సంస్కృతికి ప్రతీక బతుకమ్మ..

- జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి
- వేములవాడ కోర్టు ఆవరణలో వైభవంగా బతుకమ్మ వేడుకలు



వేములవాడ కోర్టులో బతుకమ్మ వేడుకలు..



సిరిసిల్లలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



రాజన్న ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వేములవాడ క్రైం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి అన్నారు. బుధవారం సాయంత్రం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేములవాడ కోర్టు ఆవరణలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ న్యాయవాదులు, జ్యూడిషల్ మహిళా సిబ్బందితో కలిసి జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కోలాటలు ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవుళ్లను పూలతో పూజిస్తాము, కానీ పూలనే దేవుళ్ళుగా పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణలోనే ఉందని, తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బతుకమ్మలను గుడి చెరువు మత్తడి నీటిలో నిమజ్జనం చేశారు. ఈ కర్యక్రమంలో ఏజీపీ బాను కృష్ణ, బొడ్డు ప్రశాంత్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుండ రవి, మాజీ అధ్యక్షులు గుడిసె సదానందం, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్ , ట్రెజరర్ మహేందర్, క్రీడల కార్యదర్శి గుజ్జే మనోహర్, సూపరిండెంట్ లు అంజయ్య, వెంకటేష్,మహిళా ప్రతినిధి జక్కుల పద్మ, మహిళా న్యాయవాదులు కొడిమ్యాల సంగీత, తమిరి అన్నపూర్ణ, మొగిలి సుజాత, బూర సరిత, మమత, నక్క వేద, న్యాయవాదులు అంజయ్య, నరేష్, అనిల్, కర్ణ, గంగాధర్, పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్, సెప్టెంబర 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సామాజిక సేవలను అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల డీఐఈవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలలో భాగంగా విద్యార్థినులు బతుకమ్మ వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఐఈవో శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ విజయ రఘునందన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బతుకమ్మ పండగను రాష్ట్ర పండగా అధికారికంగా జరుపుకుంటున్నామన్నారు. తెలంగాణ సంస్కృతిసంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా విద్యార్థినులు వేషధారణలతో బతుకమ్మ ఆటాపాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సామల వివేకనంద అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కోనరావుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ సంబరాలు బుధవారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. మరో మూడురోజుల పాటు బతుకమ్మ సంబరాలు కొనసాగనున్నాయి. మహిళలు తీరైన పూలతో బతుకమ్మను పేర్చి సంబరాలు జరుపుకుంటున్నారు.

● వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో బతుకమ్మ వేడుకలు కొనసాగుతున్నాయి. నాలుగవ రోజు మహిళలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో బతుకమ్మలను ఒక్కచోట పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలను ఆడారు. అనంతరం బతుకమ్మలను ఆలయ ధర్మగుండంలో నిమజ్జనం చేశారు.

సౌదీలో బతుకమ్మ సంబరాలు

సిరిసిల్ల సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యో తి): కోలాటాలు, డీజే సౌండ్‌లు,ఆట పాటలతో సౌదీ అరేబియాలో తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మ సంబరాలను మంగళవారం ఎంతో వైభవోపేతంగా జరుపుకున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అనంతనగర్ కు చెందిన జెటీయం సభ్యురాలు కోడూరి స్వర్ణజ్యోతి ఆధ్వర్యంలో సౌదీ లోని జెద్దాలో తెలంగాణ సాంప్రదాయాన్ని చాటుతూ సాగిన బతుకమ్మ వేడుకలకు భారతీయ కాన్సుల్ జనరల్ ఫహాద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో తెలంగాణ ఆడపడుచులు..

ఆశావహుల్లో ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

జనరల్ స్థానాలు 115రిజర్వ్ చేశారు. జిల్లాలో 12జడ్పీటీసీలు, 123ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 12జడ్పీటీసీ స్థానాల్లో ఆరు జనరల్ స్థానాలు, బీసీలు రెండు, ఎస్సీలు మూడు, ఎస్టీలు ఒకటి రిజర్వ్ చేశారు. 123 ఎంపీటీసీ స్థానాల్లో జనరల్ స్థానాలు 64, బీసీలకు 25, ఎస్టీలకు 6, ఎస్సీలకు 28 స్థానాలు రిజర్వ్ చేశారు. ఇప్పటికే ప్రకటించిన ఓటరు జాబితా ప్రకారం రాజన్న సిరిపిల్ల జిల్లాలో ఓటర్లు 3లక్షల 53 వేల 351 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 170772 మంది, మహిళలు 182559మంది ఉన్నారు. ఇందులో పురుషులకంటే మహిళా ఓటర్లు 11787మంది అధికంగా ఉన్నారు.

రథంపై ఊరేగిన స్వామి వారు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలోని శివకేశవస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారు రథంలో గ్రామ పురవీధుల గుండా ఊరేగారు. డప్పుచప్పుళ్ల నడుమ ముందుకు కదిలారు. మహిళలు మంగళహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. చిన్నారులు, యువతులు, మహిళల కోలాటలు ఆడారు. భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ భక్త బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంచుకోవడానికి ప్రయత్నించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావదినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎన్ఎస్ఎస్ శిబిరాలలో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ అలవడుతుందన్నారు. జాతీయసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని దేశభవిష్యత్తుకు పునాదులు వేయాలని వాలంటీర్లకు పిలుపునిచ్చారు. సామాజిక దృక్పదంతో సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి విద్యార్థులు ప్రయత్నించాలన్నారు. ఈసందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆశయాలు, లక్ష్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుమారస్వామి, అధ్యాపకులు నయిమోద్దీన్, శ్రీనివాస్, లక్ష్మన్, మమత, రాజశేఖర్, రమేష్‌లతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. నలుగురు లబ్ధిదారులకు రూ.89.5వేలు మంజూరయ్యాయని పేర్కొన్నారు.పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేసిన సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, సీఎం రేవంత్‌రెడ్డికి నాయకులు, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, జబ్బార్, ఆంజనేయులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి

కోనరావుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల అభివృద్ధితో పాటు మండలంలోని పేదవారికి చేయూత నందిస్తానని మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ అన్నారు. మండలంలోని కమ్మరిపేట తండాలో మాలోతు గంగారాం అనే వికలాంగుడికి మేచినేని శ్రీనివాసరావు ట్రస్ట్ సహకారంతో స్కూటీని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు గ్రామాల్లో వినికిడి పరికరాలు, వికలాంగులకు స్కూటీలు తనవంతు కృషిగా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ, మాజీ సర్పంచ్ సూర్యనాయక్, గోపి, పరశురాములు, దాసరి దేవరాజు, సిద్ధు, ప్రకాష్, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవీ అవతారంలో అమ్మవారు..

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రాలతో పాటు నారాయణపూర్, దుమాల, వెంకటాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, బండలింగంపల్లి, అక్కపల్లి, రంగంపేట, తదితర గ్రామాల్లో వేడుకల్లో భాగంగా బుధవారం దేవీ సన్నిధుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారు అన్నపూర్ణాదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవీకి ఒడి బియ్యం పోశారు. చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కుల, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిప్రపత్తుల మధ్య కొనసాగుతున్నాయి. మండలంలోని వివిద గ్రామాల కూడళ్ళలో ఏర్పాటు చేసిన మండపాలలో అమ్మవారు బుధవారం అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలో హిందువాహిణీ ఉత్సవ సమితీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగసముద్రాల బాలకృష్ణ, పురోహితులు రాజేశ్వర్‌శర్మ, భవాని మాలదారులు కొండ్ల వెంకటిరెడ్డి, సాదుల రాకేష్, ఏగుర్ల శ్రీనివాస్, గొడుగు హరికుమార్, కాసుపాక కిషన్, శ్రీనివాస్, దనుర్భానులతో పాటు భక్తులు పాల్గొన్నారు.





ఎల్లారెడ్డిపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, జోగాపూర్‌లో అన్నపూర్ణదేవి అవతారంలో అమ్మవారు..

● కోనరావుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన దుర్గామాత మండపాల్లో గురువారం కుంకుమ పూజలు నిర్వహించారు. అన్నపూర్ణ దేవి అవతారంలో దుర్గామాత దర్శనం ఇవ్వగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

● చందుర్తి,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మూడపల్లి, జోగాపూర్, మర్రిగడ్డ, రామన్నపేట,కట్ట లింగంపేట, లింగంపేట, తిమ్మాపూర్, నర్సింగపూర్, ఎనగల్ గ్రామాల్లో శ్రీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. దుర్గామాత అమ్మవారు మూడో రోజు బుధవారం అన్నపూర్ణదేవి అవతారంలో దర్శనమిచ్చారు. చందుర్తిలో లయన్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపంలో, కట్టా లింగంపేట. మర్రిగడ్డ గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చందుర్తిలో మణికంఠ కోలాట బృందం వారిచే నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, నాయకులు మార్త సత్తయ్య, పులి సత్తయ్య, లయన్స్ యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేవి శరన్నరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని అంబభవాని మండపాల వద్ద భక్తులు అమ్మవారికి ఓడి బియ్యాలు, చీరలు, గాజులను భక్తి శ్రద్ధలతో సమర్పించుకున్నారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లోని శ్రీ తుల్జా భవాని సేవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేయగా శ్రీతుల్జా భవాని సేవా సమితి గౌరవ అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్ అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ తుల్జా భవాని సేవా సమితి అధ్యక్షుడు వలస చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సాప పురుషోత్తం, కోడం అమర్నాథ్, ఆడెపు రేవంత్, అన్నల్‌దాస్ సాయిలు, వలస సత్యనారాయణ, శ్రీరాములు రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రద్దుకు బీజేపీ కుట్రను ప్రతిఘటించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్‌బాబు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ రద్దుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ కలిసి చేస్తున్న కుట్రలను ప్రతిఘటించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్‌బాబు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు అధ్యక్షతన రెండవ మహాసభలు జరగాయి. ముఖ్యఅతిథి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ హిందుత్వ నియంతృత్వ ఎజెండా అమలును కార్మిక, కర్షకశక్తులతో కలిసి సామాజిక శక్తులు అడ్డకోవాలని చేప్పారు. సనాతన ధర్మం ముసుగులో మనువాద భావజాలాన్ని ఆర్ఎస్ఎస్, బీజేపీ, హిందూత్వ శక్తులు పథకం ప్రకారం మందుకు తీసుకొస్తున్నాయని, దాన్ని సామాజిక శక్తులు అడ్డుకోవాలన్నారు. బీజేపీ తన రాజ్యాంగ వ్యతిరేక స్వభావానిలతో పార్లమెంట్ సాక్షిగా హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానిస్తూ చేసిన వ్యాఖలు దేశం మరవదన్నారు. ప్రజాస్వామ్యం సామాజిక న్యాయ వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ రంగానికి ఆహార సబ్సిడీకి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టానికి పూర్తి స్థాయిలో నిధుల కోత విధించి అట్టడుగు వర్గాలకు ద్రోహం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ విధానలపై దేశవ్యాప్త పోరాటాలకు కేవీపీఎస్ సామాజిక శక్తులను కలుపుకొని పోరాడుతుందన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలలో కుల వివక్ష అంటారానితనం కొనసాగితే సహించేది లేదన్నారు. సామాజి మాధ్యమాలలో మహనీయుల లక్ష్యాలు ఆశయాలను కుల నిర్మూలన లక్ష్యలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి తిప్పారపు సురేష్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం జస్టిస్ పున్నయ్య కమీషన్ ఏర్పాటు చేయించి అంటరానితనం కుల వివక్షత నిర్మూలన కోసం కేవీపీఎస్ నిర్విరామ పోరాటం చేసిందన్నారు. కులాంతర వివాహాల జంటల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు రావాల్సిన పరిహారాన్ని విడదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే పరిహారం విడదల చేయాలని డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూసం రమేష్, డివైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి మల్లారపు అరుణ్, ఐద్వా జిల్లా కార్యదర్శి విమల, వ్యవసాయ కార్మికు సంఘం జిల్లా కార్యదర్శి గన్నెరపు నర్సయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500సిలిండర్, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా, ఎల్‌వోసీల ద్వారా ఇప్పటి వరకు 20కోట్లు పైచిలుకు మంజూరుచేశామని తెలిపారు. పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 10 సంవత్సరాలలో 400 కోట్లు పంపిణీ చేస్తే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి నేటివరకు 800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం

చందుర్తి సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని చందుర్తి ఎస్సై రమేష్ పేర్కొన్నారు. చందుర్తి మండలం దేవుని తండా గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం రాత్రి కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని, ప్రజలందరు పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానాస్పదంగా కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాలండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపార సముదాయాలు, కాలనీల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవా లని, సీసీ కెమెరాల ద్వారా భద్రత ఉంటుందని, నేరస్తులను, దొంగల ను త్వరగా గుర్తించవచ్చని తెలిపారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్ర మత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయ దేవాలయ కమిటీ కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విద్యానగర్ శ్రీ అభయాంజనేయ దేవాలయం ఆవరణలో బుధవారం జరిగిన సమావేశంలో దేవాలయం కమిటి నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీ అభయాంజనేయ దేవాలయం కమిటీ అధ్యక్షుడు చేరాల ప్రసాద్, ఉపాధ్యక్షులు మాదిరెడ్డి అంజనాదేవి, దూస ఈశ్వరి, గాజుల శ్రీనివాస్, గంద్ర పృథ్వీదర్‌రావు, పయ్యావుల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి పుప్పాల ముంకుదేష్, కోశాధికారి మామిడాల శ్రీధర్, సహాయ కార్యదర్శులు లింగంపల్లి సతీష్‌కుమార్, దూస ప్రభాకర్, గోనె రాజేష్, చకినాల లలిత, జిందం కావ్యసాంస్కృతిక కార్యదర్శులు తోట మంజుల గడ్డం దేవయ్య, బైరి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులు చింతకింది శ్యాంకుమార్, రాయిల్ల వేణు, ఎలిగేటి లలితను ఎన్నుకున్నారు. అదే విధంగా ముఖ్య సలహాదారులు జిందం చక్రపాని, బొల్లి రామ్మోహన్, మామిడాల కృష్ణ, వెల్మాల తిరుపతిరెడ్డి, చిట్నేని శ్రీనివాస్‌రావు, జిందం దేవదాస్, పులిబాబు, గోసిక శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు దూస భూమయ్య, వడ్డెపల్లి రమేష్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంను సభ్యులు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చాకలి రాజయ్య కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు బుధవారం పరామర్శించారు. పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేయడం వల్ల తప్పించుకునే యత్నంలో రాజయ్యకు ఎదురైన ఘటన, మృతి వివరాలను అడిగితెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. నాయకులు రమేశ్, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

ప్రత్యేక అధికారిని కేటాయించాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) మండలంలోని వల్లంపట్ల గ్రామపంచాయితీకి ప్రత్యేక అధికారిని కేటాయించాలని మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయనర్సింహారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. గతంలో పనిచేసిన ప్రత్యేక అధికారి బదిలీ కాగా, మరో అధికారికి బాధ్యతలు అప్పగించినా తీసుకోవడానికి సిద్ధంగా లేక గ్రామానికి రావడం లేదన్నారు. బతుకమ్మ పండుగపూట గ్రామంలో ఏర్పాట్లు చేయవలసిన అధికారి లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి మరో ప్రత్యేకాధికారిని నియమించాలని కోరారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మండల నూర్‌భాషా సంఘ అధ్యక్షుడు మహమ్మద్ సలావోద్దీన్, కాంగ్రెస్‌పార్టీ మైనార్టీసెల్ అధ్యక్షుడు జమాల్‌లు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీల అభివృద్ధి అంటే కేవలం సబ్సిడీలు ఇవ్వడం కాదని వారు స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించాలన్నారు. అందులో భాగంగా ప్రభుత్వం ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం క్రింద వితంతువులు, విడాకులు పొందిన వారికి రూ 50వేలు, ఫకీరు, దూదేకుల వర్గాలకు మోపెడ్ వాహనాలు ఇవ్వడానికి ఒక్కొక్కరికి రూ లక్ష గ్రాంట్ మంజూరు చేయాలని నిర్ణయించడం అభినందనీయం అన్నారు. పథకాల రూపకల్పన చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసర సరుకులను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిరాశ్రయులైన ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన 25 కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. సుమారు రూ.1.25 లక్షల విలువైన సరుకులను పంపిణీ చేశారు. ప్రజలను పలు అంశాల్లో చైతన్యవంతులను చేయడంతో పాటు సామాజిక కార్యక్రమాలను లయన్స్ క్లబ్ నేతృత్వంలో చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు రాములు, బద్రేశం, సతీష్, శివప్రసాద్, రమేశ్, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రామచంద్రం, భాస్కర్‌రెడ్డి, మల్లేశ్, రవి, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వరదలతో నష్టపోయిన బాధిత కుటుంబాలకు ఎల్లారెడ్డిపేట లయన్స్‌క్లబ్ అండగా నిలిచింది. లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ వారి సహకారంతో సాయాన్ని అందించారు. మండల కేంద్రంతోపాటు నర్మాల గ్రామాల్లో వరద బాధిత కుటుంబాలకు చేయూతనిచ్చారు. గంభీరావుపేటలో 8కుటుంబాలకు, నర్మాలలో 18కుటుంబాలకు కుటుంబానికి 5వేలు విలువ చేసే 27రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కోదండ రాములు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బద్రేశం, జోన్ వైస్ పర్సన్ కోట సతీష్, పీడిజి అనంతుల శివప్రసాద్, జీఎల్టీ కోఆర్డీనేటర్ ఇనగుర్తి రమేష్, ఎల్లారెడ్డిపేట లయన్స్ క్లబ్ బాధ్యులు నంది కిషన్, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, వయ్యావుల రామచంద్రం, కొమిరిశెట్టి తిరుపతి, సద్ది లక్ష్మారెడ్డి, ముత్యంరెడ్డి, గొర్రె మహేష్ నర్మాల మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజు తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపు సంఘ భవనానికి నిధులు మంజూరు

కోనరావుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామ మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి ఎంపీ నిధులు రూ. 5 లక్షల మంజూరు పత్రాన్ని అందజేసినట్లు బిజెపి మండల అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘ భవనానికి ఐదు లక్షల నిధులు మంజూరు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి కృతజ్ఞతలు తెలిపారు. సందర్భంగా బీజేపీ నాయకులు గొట్టె రామచంద్రం, పల్లం అన్నపూర్ణ, మహిపాల్, తిరుపతి, జలంధర్, నాగరాజు, భూమయ్య, ఆనందం, దేవయ్య, ప్రతాప్,బుగ్గయ్య పాల్గొన్నారు.

28న మాజీ కౌన్సిలర్ సంతాప సభ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ మాజీ కౌన్సిలర్, దళిత నాయకుడు సిరిగిరి రమేష్ సంతాప సభ ఈనెల 28న జరుగుతుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రావాలని మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు రాగుల రాములు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రమేష్ హత్యకు కారుకులైన సుపారి గ్యాంగ్ కాల్ డేటాను పోలీసులు పరిశీలిచాలన్నారు. ఆదివారం సిరిసిల్ల వస్త్ర వ్యాపార సంఘం భవనంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ రమేష్ సంతాప సభ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు కంసాల మల్లేశం, బొల్లుమల్ల శివ, సిరిగిరి పరుశరాము, సిరిగిరి వెంకటేష్, సిరిగిరి రాజు, తంగ రాహుల్, తీపిరి ఉమాశంకర్, చందు, శ్రీవర్ధన్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

వేములవాడ రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గర్భిణులులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం అన్నారు. జయవరంలో బుధవారం నిర్వహించిన పోషణమాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణలకు సాముహిక సీమంతం నిర్వహిచి. తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సరిత, మహిళ సాధికారత కేంద్రం సమన్వయకర్త రోజా, అంగన్‌వాడీ టీచర్ గంగజాల, ఆశావర్కర్ గీత, తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి,సెప్టెంబరు(ఆంధ్రజ్యోతి): పౌషికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వేములవాడ ఐసీడీఎస్ సడీపీవో సౌందర్య అన్నారు. చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సెప్టెంబర్ మాసంలో పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. పోషణ మాసం కార్యక్రమాలను గర్భవతులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలింతలు,గర్భవతులు, చిన్నారులు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పిలుపునిచ్చారు. పోషకాహారాలను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శంకరమ్మ, ప్రధానోపాధ్యాయులు ఆనందరెడ్డి, ఉపాధ్యాయులు భూపతి అంగన్‌వాడీ టీచర్లు బుర్ర రేణిక, న్యాత పద్మ, రమా, జ్యోతి, గసికంటి రేణుక తదితరులు పాల్గొన్నారు.